www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 14 సెప్టెంబర్ 2025
5

జాతీయ లోక్ అదాలత్‌లో 14,005 కేసులు పరిష్కారం

- రూ.9.94 కోట్లు కక్షిదారులకు చెల్లింపు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

ప్రజాశక్తి - కడప : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం 23 బెంచీలు ఏర్పాటు చేసి నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 14,005 కేసులను రాజీ ద్వారా పరిష్కరించి రూ.9.94 కోట్లను కక్షిదారులకు చెల్లించడం చెల్లించామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ సభ్యులు, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు చేసి కసులను పరిష్కరించుకున్నారని చెఉప్పారు. జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసిన అన్ని డిపార్ట్‌మెంట్ అధికారులకు ఈ సందర్భంగా జడ్జిలు కృతజ్ఞతలు తెలియజేశారు.

కూటమిలో లుకలుకలు!

- జిజిహెచ్ డైరెక్టర్ల నియామకంలో విభేదాలు
- టిడిపి జిల్లా అధ్యక్షుడిపై బిజెపి తీవ్ర విమర్శలు
- రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేస్తామని వెల్లడి
- జమ్మలమడుగులోనూ నివురుగప్పిన నిప్పలే?!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కూటమిలో లుకలుకలు తీవ్రరూపం దాల్చాయి. జిల్లాలోని కడప, జమ్మలమడుగు, నియోజకవర్గాల్లో కూటమిలో టిడిపి, బిజెపి, జనసేన నాయకుల మధ్య పరిస్థితి నివురు గప్పిన నిప్పును తలపిస్తోంది. ఎమ్మెల్యేల లెటర్ల ఇవ్వడం దగ్గర నుంచి, తమ అనుచరులకు పనులు చేయమని చెప్పడం వెరసి నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడం వరకు కూటమి నాయకుల్లో ఐక్యత కొరవడింది. తాజాగా కడప పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి జిజిహెచ్ పాలక మండలి డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయడం వివాదాస్పదంగా మారింది. కోర్టుల పరిధిలోని పిపి వంటి నామినేటెడ్ పోస్టుల భర్తీ వ్యవహారాల్లో కూటమి నేతలను లెక్కచేయకుండా ఏకపక్షంగా వ్యవహరించడంపై కూటమిలో విబేధాలు నెలకొన్నట్లు తెలుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసి గెలిచిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి టిడిపి, బిజెపి, జనసేన అధ్యక్షులు పరస్పరం సంప్రదింపులు చేసిన అనంతరం నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉన్న సంగతిని బిజెపి ఎత్తి చూపుతోంది. ఇటువంటి సంప్రదాయాన్ని తుంగలో తొక్కి బిజెపి తరుపున కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వ్యవహారంలో జోక్యం చేసుకోవడం ఏమిటని, డైరెక్టర్ వంటి నామినేటెడ్ పోస్టులను ఎలా భర్తీ చేస్తారని బిజెపి అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి నిలదీస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేస్తామని వ్యాఖ్యానించడం కూటమి నాయకుల్లో విబేధాల తీవ్రతకు అద్దం పడుతోంది. జమ్మలమడుగు నియోజకవర్గంలో బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సి.భూపేష్‌రెడ్డి మొన్నటి వరకు ఉప్పు నిప్పుగా ఉన్న సంగతి తెలిసిందే. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులైన బాబాయ్, అబ్బాయ్‌లే కావడంతో విభేదాలు పూర్తిస్థాయిలో బయటికి పొక్కని పరిస్థితి కనిపిస్తోంది. ఏదేమైనప్పటికీ జిల్లాలోని కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి నాయకుల మధ్య అనైక్యత క్రమేణా పతాకస్థాయికి చేరుకుంటోందనే వాదన వినిపిస్తోంది.

మాటల మాంత్రికుడు ఆత్రేయ

- ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

సినిమాల్లో మనసుకు సంబంధించిన పాటలు ఎక్కువగా రాసి, మానవ జీవిత తత్వాన్ని గుట్టు విప్పిన ఆత్రేయ 'మనసు కవి'గా, మన 'సుకవి'గా ప్రసిద్ధులయ్యారని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం శనివారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్ కార్యాలయంలో ఆచార్య ఆత్రేయ 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ నాటక రచయితగా, రంగస్థల నటుడిగా ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఆత్రేయ సినిమా రంగంలో ప్రవేశించి దర్శకుడిగా, నిర్మాతగా, పాటలు, సంభాషణల రచయితగా గొప్ప కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన సినిమా ప్రేక్షకుల్ని కంటతడి పెట్టించి వారి గుండెల్లో పదిలమైన స్థానం సంపాదించారన్నారు. మొదటిసారిగా దీక్ష సినిమాకు పాటలు రాసిన ఆత్రేయ 400 సినిమాలకు దాదాపుగా1400 పాటలు రాశారని, ప్రతిపాట మన మనసుని తాకి ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ ఆత్రేయ పరివర్తన, ఎన్‌జిఒ, కప్పలు, ఈనాడు, విశ్వశాంతి, భయం, మాయ, సామ్రాట్ అశోక, గౌతమ బుద్ధ మొదలైన నాటకాలు రాశారని చెప్పారు. ఆయన రాసిన నాటకాలు, నాటికలు వందలసార్లు ప్రదర్శింపబడి ప్రేక్షకాదరణ పొందాయన్నారు. దాసరి సుధాకర్ మాట్లాడుతూ ఆత్రేయ పాటలు రాసిన మంచి మనసులు, డాక్టర్ చక్రవర్తి, బడిపంతులు, మూగమనసులు, ప్రేమనగర్, స్వాతిముత్యం, అంతులేని కథ, మరోచరిత్ర మొదలైన గొప్ప చిత్రాలు ఆయన పాటలతోనే విజయం సాధించాయని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. ఇంకా పలువురు ప్రముఖ రచయితతలు ప్రసంగించారు. కార్యక్రమంలో కళాకారులు రామనపల్లి శంకర్, వీరదాసరి ప్రకాష్, యడవల్లి రామలింగయ్య, మందల చిన్నయ్య, గడికోట రెడ్డయ్య, మందల మురళి, ఎం.వెంకటసుబ్బయ్య, ఎన్.రామ సుబ్బారెడ్డి, బి.బాల ఓబయ్య, ఎస్. వీరయ్య పాల్గొన్నారు.

రాయలసీమ రత్నం 'ఫాతిమా'

ఎన్‌టిఆర్ యూనివర్సిటీ విసితో ఫాతిమా మెడికల్ కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపలో రాయలసీమ రత్నంగా ఫాతిమా మెడికల్ కళాశాల వెలుగొందుతుందని డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ విసి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఫాతిమా మెడికల్ కళాశాలను విసి సందర్శించారు. కళాశాల కరస్పాండెంట్ ఎ.క్యూ. జవ్వాద్ సాదరంగా ఆహ్వానించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శైలా రేఖ, సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, అన్ని విభాగాల అధిపతులు, వైద్యులు, వైద్య విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ వైద్య వృత్తిలో నైపుణ్యాన్ని ఎలా పెంచుకోవాలో తెలిపారు. విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. కష్టపడి చదివి మంచి డాక్టర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. వైద్య విద్యను అభ్యసించాలనే ప్రతి ముస్లిం విద్యార్థులకు కలల సౌధం ఫాతిమా మెడికల్ కళాశాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో కళాశాల మరింత అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ జవ్వాద్ మాట్లాడుతూ కళాశాలను సందర్శించిన విసికి కృతజ్ఞతలు తెలిపారు. విసి మంచి వ్యక్తిత్వం కలవారని కొనియాడారు. కర్నూల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా, సూపరింటెండెంట్ గా పనిచేసి కార్డియాలజీ విభాగాన్ని స్థాపించారని పేర్కొన్నారు. అనంతరం విసిని ఘనంగా సత్కరించారు.

కడప రిమ్స్‌ను అభివృద్ధి దిశగా తీసుకెళ్లండి

ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) అభివృద్ధికి ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం ఆయన కడప రిమ్స్‌ను సందర్శించారు. అన్ని విభాగాల హెచ్‌డీలతో సమావేశమయ్యారు. రిమ్స్ వైద్య కళాశాల చాలా విస్తీర్ణంగా ఉందని, ఆవరణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్య కళాశాల గెస్ట్ హౌస్, కళాశాల క్యాంటీన్, కళాశాల ఆడిటోరియం, ప్లే గ్రౌండ్‌ను త్వరలో ఏర్పాటు చేయాలన్నారు. ఆ తర్వాత పీజీ, యూజీ వైద్య విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వైద్య విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. జమున, జిజిహెచ్ సూపరిండెడెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ విజయభాస్కర్ రెడ్డి, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వై.శ్రీనివాసులు, అన్ని విభాగాల హెచ్ఒడిలు, వైద్యులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించి ఐఆర్ ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగోన్నతలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా ఫలితం శూన్యమని ఆర్‌టిసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఆర్‌టిసి ఇయు కడప జోన్ సమావేశం జోనల్ అధ్యక్షులు కె.కె.కుమార్ అధ్యక్షతన, జోనల్ కార్యదర్శి ఎన్. రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఆర్‌టిసిలో ఆరేళ్లుగా ఉద్యోగోన్నతుల కోసం ఎదురు చూస్తున్న సుమారు 6 వేల మంది ఉద్యోగులు నిరుత్సాహానికి గురి అవుతున్నారని పేర్కొన్నారు. సిఎం ఉద్యోగోన్నతులపై ఆమోదం ఇచ్చినా కింది స్థాయి అధికారులు అడ్డంకులు సృష్టించడం వలన ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలిపారు. జిఎడిలో ఉన్న ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ముఖ్యమంత్రి ఇచ్చిన అనుమతులకు అంగీకారం తెలియజేస్తూ జిఒను విడుదల చేసేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఇ.యు రాష్ట్ర నాయకులు పి.సుబ్రమణ్యంరాజు, సి.నబిరసూల్, కె.మద్దిలేటి కె.అర్జున, పి.ఏ.మజీద్, విజయకుమార్, సి.వి.మురళీధరన్, వి.వెంకటేశ్వర్లు, ఎ.మురగమ్మ, కె.బి.నాగార్జున రెడ్డి, యస్.ప్రసాద్ బాబు, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ యం.రామాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రేమాలయంలో అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్నదానం చేస్తున్న సుబ్బారెడ్డి

తెలుగుదేశం పార్టీ నాయకులు గుడిపాటి గోపీనాథ్ ఆధ్వర్యంలో 2వ డివిజన్ కార్పొరేటర్ ముక్కర సుబ్బారెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో కేక్ కట్ చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా గోపీనాథ్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. వృద్ధులు, నిరాశ్రయుల మధ్య పుట్టినరోజు వేడుకలు చేసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. టిడిపి ఎన్నారై కువైట్ ఉపాధ్యక్షులు షేక్.రహమతుల్లా, గోపీనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును స్ఫూర్తిగా తీసుకుని కడప జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యే ఆర్.మాధవి సహకారంతో 2వ డివిజన్ అభివృద్ధికి కార్పొరేటర్ సుబ్బారెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజా, రామకృష్ణ, అనిల్, విశ్వనాథ్, సాధు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌస్‌పీర్

విద్యార్థుల ఆశలు ఖననం : కాంగ్రెస్

ప్రజాశక్తి- కడప అర్బన్

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థుల ఆశల ఖననమే అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ అన్నారు. శనివారం ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమం 5వ డివిజన్ అశోక్ నగర్ లో నిర్వహించారు. అక్కడ ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌస్ పీర్, జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్ మాట్లాడుతూ పిసిసి అధ్యక్షురాలు షర్మిల, డిసిసి అధ్యక్షురాలు విజయ్ జ్యోతి సహాయ సహకారాలతో ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమం నిర్విరామంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రయివేటీకరణతో దేశ ప్రగతి ముందుకు సాగదని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని హితవు పలికారు. ప్రయివేటీకరణ వల్ల ధనవంతులు మరింత సంపదపరులు అవుతారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఎక్కువ మెడికల్ కళాశాలలు తెచ్చామని చెబుతోందని, కానీ ఎక్కడ కనిపించడం లేదని తెలిపారు. అన్ని పిల్లర్ల దశలోనే ఆగిపోయాయని చెప్పారు. కార్యక్రమంలో 5వ డివిజన్ ఇన్‌ఛార్జులు ఫజలుల్లా, ఇతర డివిజన్ ఇన్‌ఛార్జులు దాసరి శ్రీనివాసులు, శివ, జి.వి. అంజన్ కుమార్, యూసుఫ్, జాబీర్, మస్తాన్, రెడ్డయ్య, అబ్దుల్ రౌఫ్, నీలం, షామీర్, ముబారక్, సిద్ధిక్, అహ్మద్, ఇమామ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ మురికినాటి శ్రీధర్

ప్రజాశక్తి- కడప అర్బన్ : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ మురురికినాటి శ్రీధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కడప నియోజకవర్గం రెండవ డివిజన్ దేవుని కడపలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి 35 ఏళ్లుగా కష్టపడి పని చేస్తున్నానని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం తన కష్టాన్ని గుర్తించి రాష్ట్ర డైరెక్టర్ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని చెప్పారు.

కడప, అన్నమయ్య ఎస్‌పిలు బదిలీ

కడప ఎస్‌పిగా నచికేత్, అన్నమయ్యకు ధీరజ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి టౌన్

కడప ఎస్‌పి నచికేత్

అన్నమయ్య ఎస్‌పి ధీరజ్

కడప, అన్నమయ్య జిల్లాల ఎస్‌పిలు బదిలీ అయ్యారు. ప్రభుత్వం శనివారం రాష్ట్రంలోని 14 జిల్లాలకు చెందిన ఎస్‌పిలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడుగురు ఎస్‌పిలు కొత్తవారు కావడం గమనార్హం. కొత్త కేటగిరీకి చెందిన అధికారులే కడప, అన్నమయ్య జిల్లాలకు కొత్త ఎస్‌పిలుగా బాధ్యతలు చేపట్టనున్నారు. కడప జిల్లా ఎస్‌పిగా నచికేత్ నియమితులయ్యారు. ప్రస్తుత ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్ 2025 జనవరి 24న బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈయన హయాంలో ప్రతిష్టాత్మక పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉపఎన్నికలు జయప్రదంగా నిర్వహించారు. ఈయన్ను ఎక్కడికి పోస్టింగ్ ఇచ్చినదీ తెలియాల్సి ఉంది. పాడేరులో అదనపు ఎస్‌పిగా పనిచేస్తున్న కె.ధీరజ్‌ను ఉద్యోగోన్నతి కల్పిస్తూ అన్నమయ్య జిల్లా ఎస్‌పిగా నియమించింది. ప్రస్తుత ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఏడాది కిందట బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లాలో అనేక సంచలనాత్మక హత్య కేసులతో పాటు దోపిడీ కేసులు సమస్యాత్మక కేసులను ఛేదించి తనదైన గుర్తింపును తెచ్చుకున్నారు. అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అప్పటి కడప ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు స్థానంలో కడప జిల్లా ఎస్‌పిగా అదనపు బాధ్యతలు సైతం నిర్వహించారు. ప్రస్తుతం ఈయన్ను కృష్ణా జిల్లాకు బదిలీ చేసింది.

హెచ్‌ఐవి, ఎయిడ్స్, మాదక ద్రవ్యాలపై ప్రచారం

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో శనివారం వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో హెచ్‌ఐవి, ఎయిడ్స్, మాదకద్రవ్యాలపై అవగాహన ప్రచార ర్యాలీని ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె. నాగరాజు జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రచార వాహనం ద్వారా ప్రజలకు మేలు చేకూరుతుందని చెప్పారు. డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు మాట్లాడుతూ నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. జిల్లా ఎయిడ్స్, లెప్రోసి, టిబి అధికారి డాక్టర్ రవి బాబు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆరోగ్య శాఖా సిబ్బంది, పిహెచ్‌సి స్టాఫ్, కళాశాలలు ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, స్కూల్స్, లైన్ డిపార్ట్మెంట్స్‌కు ప్రతి గ్రామానికి వెళ్లి హెచ్‌ఐవి పరీక్ష, సుఖ వ్యాధులు, కండోమ్, టోల్ ఫ్రీ నెంబర్ 1097, హెచ్‌ఐవి యాక్ట్ 2017, హెచ్‌ఐవి అపోహలు-వాస్తవాలు లైన్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వి. భాస్కర్ మాట్లాడుతూ ఈ ప్రచార రథం 15 రోజుల పాటు వివిధ గ్రామాలలో, పట్టణాలలో ఎల్ఇడి టీవీ స్క్రీన్ ద్వారా హెచ్‌ఐవి పై అవగాహనా కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మలేరియ అధికారి మనోరమ, డిఇఎంఒ భారతి, మరియా కుమారి, ప్రసాద్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అఫ్రోజ్, సిలార్, అబ్దుల్ సాదిక్, సిఎస్‌సి పాజిటివ్ నెట్వర్క్ ప్రెసిడెంట్ ఉష రాణి, బాష, షేర్ ఇండియా మంజుల, జిల్లా ఆరోగ్య శాఖా సిబ్బంది పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనుల ప్రారంభంలో రితీష్‌రెడ్డి

రూ.32 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలోని ఇటుకలపాడు , సావిశెట్టిపల్లె , కొండరాజు పల్లె, వరికుంట్ల గ్రామాల చెరువులకు బ్రహ్మ సాగర్ ఎడమ కాలువ నుంచి లిఫ్ట్ ద్వారా చెరువులకు నీరు నింపేందుకు రూ. 32 కోట్లతో పనులు ప్రారంభించారు. శనివారం బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రితీష్ రెడ్డి, బొజ్జ రోషన్న, బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నరిశెట్టి సుప్రజ కాంట్రాక్టర్ పద్మనాభ రెడ్డి కలసి సావిశెట్టిపల్లె దగ్గర శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రితీష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాశినాయన మండలంలో తెలుగు గంగ కాలువకు ఎగువన ఉండే గ్రామాల ప్రజలకు ఐదువేల ఎకరాలకు నీరు అందించడమే లక్ష్యమని చెప్పారు. రైతులు ఎలాంటి ఇబ్బంది పడకూడదని తాము పనులు ప్రారంభించామని చెప్పారు. కాశినాయన మండలంలో ఎమ్మెల్సీ సొంత మండలం అయిన ప్పటికీ ఆయన చేసింది ఏమీ లేదని వాపోయారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు రైతులందరూ కాంట్రాక్టర్‌కు సహకరించి ఎటువంటి ఆటంకం కలగకుండా దగ్గర ఉండి పనులు చేయించుకోవాలని, కార్యక్రమంలో కాంట్రాక్టర్ జోగ్గారిపల్లె తిరుమలరెడ్డి , డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్, ఎస్ఐ యోగేంద్ర, పోరుమామిళ్ల బిజెపి మండల అధ్యక్షుడు నాగేంద్ర , కాశినాయన మండలం క్లస్టర్ ఇన్‌ఛార్జి బసిరెడ్డి రవీంద్రారెడ్డి, సొసైటీ చైర్మన్ బంగారు గురువిరెడ్డి, సర్పంచ్ ఖాజావలి, మాజీ మార్కెట్ చైర్మన్ చెన్న రాయుడు, పోరుమామిళ్ల టిడిపి నాయకులు చిన్న వెంకటసుబ్బయ్య, కృష్ణారెడ్డి, ఎంపిటిసి రమణ, ఇటుకులపాడు డీలర్ నాగేష్ , సుబ్బారెడ్డి, ఉప్పులూరు పోలిరెడ్డి , పంగా రవీంద్రారెడ్డి, కోడిగుడ్లపాడు శ్రీనివాసులు రెడ్డి, దున్నెపు కృష్ణారెడ్డి , విజయ్ రెడ్డి , వడ్డమాను విజయ కుమార్ రెడ్డి, రోహిత్ రెడ్డి పోలీస్ కానిస్టేబుల్ వెంకట సుబ్బయ్య ,సుబ్బరాయుడు మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమి సాధించే వరకూ పోరాటం

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని కత్తెర గండ్ల పంచాయతీలో గల శివాలయం భూమి ఎవరైతే కబ్జా చేశారో వారి దగ్గర నుండి చట్ట పరంగా వచ్చేంతవరకు శివాలయం కమిటీ తరపున తాము పోరాడుతూ ఉంటామని కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గంగాధర్ ఆచారి అనే భక్తులు ఆలయ కమిటీ సభ్యుల పేరు మీద 35 సెంట్లు రిజిస్టర్ చేయించారని ఆ స్థలాన్ని పోరుమామిళ్ల వైసిపి నాయకులు కరెంటు రమణారెడ్డి దౌర్జన్యంగా కబ్జా చేశారని చెప్పారు. పైగా వెంచర్ స్థలాన్ని విక్రయించుకున్నారని వాపోయారు. ఇది ఏమి అన్యాయమని అడిగితే తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు తమకు న్యాయం చేయాలని కనుకనే కోర్టును ఆశ్రయించామని చెప్పారు. సమావేశంలో శివాలయం కమిటీ చైర్మన్ బైరిశెట్టి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు రమణారెడ్డి , రాఘవేంద్ర రెడ్డి, వెంకటరమణారెడ్డి, చెన్నారెడ్డి, సోమశేఖర్ యాదవ్ , కత్తెర గండ్ల పంచాయతీ ఉపసర్పంచ్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తేక్వాండోలో చిన్నారుల విజయం

ప్రజాశక్తి - కడప అర్బన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వే కోడూరులో నిర్వహించిన జిల్లాస్థాయి తేక్వాండో పోటీలలో అండర్ - 19 విభాగంలో కడప చిన్నారులు విజయం సాధించారు. 44 కిలోల విభాగంలో ఎన్.నాగమోక్షిత విజయం సాధించి రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. 55 కిలోల విభాగంలో పి.వి.ఎస్.రెడ్డమ్మ, 59 కిలోల విభాగంలో కె.ఆర్ రెడ్డి బంగారు పతకం సాధించారు. బాలుర విభాగంలో 54 కిలోల విభాగంలో కె.ఆర్.సాత్విక్ రెడ్డి బంగారు పతకం సాధించారు. 85 కిలోల విభాగంలో వి.ముని చైతన్య బంగారు పతకం సాధించి, రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. కార్యక్రమంలో అండర్ 19 జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, పూర్వ కార్యదర్శి శారద, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి విజయభాస్కర్, ఉపాధ్యక్షులు వెంకటేష్, కోచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

బుగ్గలపల్లె దళితవాడలో వైద్యశిబిరం

బాధితులకు మలేరియా, డెంగీ పరీక్షలు చేసిన వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

బుగ్గలపల్లి దళితవాడలో విషజ్వరాలు ప్రబలడంతో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, పర్యవేక్షణ సిబ్బంది శనివారం గ్రామాన్ని సందర్శించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎఎన్ఎం, సిహెచ్ఒ, ఆశావర్కర్లతో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి జ్వరాలపై సర్వే నిర్వహించారు. గ్రామంలోని వీధులన్నీ సందర్శించి శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరం నిర్వహించగా నలుగురు జ్వరపీడితులను గుర్తించి వారికి మలేరియా, డెంగీ పరీక్షలు చేసి అవసరమైన చికిత్స అందించారు. మొత్తం 243 కుటుంబాలను లార్వా సర్వే నిర్వహించారు. యాంటీ-లార్వల్ చర్యలు ఆయిల్ బాల్స్ వదలడం చేపట్టారు. ప్రస్తుతానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వరాల కావలసిన మందులు, ల్యాబ్ పరీక్షా సౌకర్యాలు సమృద్ధిగా ఉన్నాయని వైద్యాధికారి చెప్పారు. జిల్లా మలేరియా అధికారి మనోరవ , జిల్లా ఎపిడెమియాలజిస్టు ఖాజా మొహియుద్దీన్ గ్రామాన్ని సందర్శించి పంచాయతీ కార్యదర్శికి పారిశుధ్య చర్యలపై సూచనలు ఇచ్చారు. గ్రామంలో మురుగునీటి కాల్వలు లేకపోవడంతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం, అపరిశుభ్ర వాతావరణంలోతట్టు ప్రాంతాల్లో కనిపించాయి. మురుగు నీరు వెళ్లడానికి మార్గం లేకపోవడంతో గ్రామంలో అనారోగ్య వాతావరణం నెలకొంది. ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, నిరోధక చర్యలపై అవగాహన కల్పించారు.

నూతనోత్సాహం

ప్రజా'దృష్టి'

జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు అంచనాలకు మించి జయప్రదమయ్యాయి. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కేడర్‌లో నూతనోత్సాహం తొణికిసలాడుతోంది. జిల్లాలోని సాధారణ ప్రజా సంఘం జాతీయ స్థాయి సమావేశాలను ఊహించని రీతిలో జయప్రదం చేయడం ప్రశంసనీయం. అరుదైన అవకాశాన్ని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకుని జయప్రదం చేయడంతో వ్యవసాయ కార్మిక సంఘం సత్తాను చాటుకుంది. గతంలో సిఐటియు, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ వంటి ప్రజాసంఘాలు రాష్ట్ర స్థాయి పిలుపులను, సమావేశాలను జయప్రదం తెలిసిందే. పెద్దఎత్తున సభ్యత్వాలు ఉండడం తెలిసిందే. ప్రభుత్వ, పారిశ్రామిక అనుబంధ సంస్థల్లోని కార్మికుల్లో చైతన్యం పాలు ఎక్కువ కావడం తెలిసిందే. ప్రజా సంఘాలు రాష్ట్ర స్థాయి సమావేశాలను నిర్వహించి జయప్రదం చేయడంలో ఆశ్చర్యం లేదు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం భిన్నమైన నేపథ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ కార్మిక సంఘం అందరిని కలుపుకుని వెళ్లి జిల్లాలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహణలతో తమ సత్తాను నిరూపించుకుంది. జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన ఉద్యమ కార్యకలాపాలకు, భారీ ర్యాలీ, బహిరంగసభలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా సాగు ఊపందుకుంది. జిల్లా వ్యవసాయశాఖ గతేడాది ఎరువుల వినియోగాన్ని బట్టి యూరియా సహా ఇతర రకాల ఎరువులను అందుబాటులో ఉంచాల్సి. కానీ జిల్లా వ్యవసాయశాఖ అటువంటి ప్రయత్నం చేయడంలో విఫలమైంది. ఫలితంగా జిల్లాలో యూరియా కొరత తీవ్రరూపం దాల్చింది. జిల్లా రైతాంగం యూరియా కోసం దుకాణాల ఎదుట బారులు దీరాల్సి దుస్థితి దాపురించింది. రైతు సంఘాల నుంచి పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఉలిక్కి పడింది. జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్, ఎస్పీ స్థాయి ఉన్నతాధికారులు పలుమార్లు వివరించాల్సి వచ్చింది. జిల్లా ఉన్నతాధికారులు యూరియాపై కొరత లేదని పలుమార్లు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాస్తవాలకు పొంతన లేకుండా ఉంటోంది. జిల్లాలోని తెలుగుగంగ, కుందూ, కెసి కెనాల్ ప్రాంతాల్లో సాగు ఊపందుకోవడంతో యూరియా కోసం రైతులు ఎగబడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఫెర్టిలైజర్ దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తుండడం పరిపాటిగా మారింది. జిల్లా వ్యవసాయశాఖ రైతులు యూరియా వినియోగాన్ని రెట్టింపు చేయడం వల్లే సమస్య తలెత్తిందని చెబుతోంది. వ్యవసాయ శాఖ చెబుతున్న వాదనకు ఎరువుల దుకాణాల దగ్గర రైతులు బారులు తీరడాన్ని పరిశీలిస్తే పొంతన లేదని తెలుస్తోంది. ఒకవేళ అధిక వినియోగం చేస్తున్న మాట నిజమైతే అటువంటి రైతుల సంఖ్య చేతి వేళ్ల మీద లెక్కించ వచ్చుననే వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం యూరియా వినియోగాన్ని తగ్గించాలనే కేంద్రం ఆదేశాలను అమలు చేయడం వల్లే సమస్య ఏర్పడిందనే వాదన పెద్దఎత్తున వినిపిస్తోంది. జిల్లా వ్యవసాయశాఖ చేపట్టిన విజిలెన్స్ దాడులు నామమాత్రంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయశాఖ పూర్తిస్థాయిలో దాడులు చేస్తే యూరియా కొరత ఉండదని, రైతులను అధిక ధరలతో నిలువు దోపిడీ చేయడం వంటి ఘటనలు ఉండేవి కాదనే వాదనలు వినిపిస్తున్నాయి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రోడ్డుపై ఉన్న మట్టిని తరలిస్తున్న జెసిబి యంత్రం, ట్రాక్టర్

రోడ్డుపై ఉన్న మట్టి తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డుపై ఉన్న మట్టిని పంచాయతీ అధికారులు తొలగించారు. శనివారం 'ప్రజాశక్తి' దినపత్రికలో 'కాలువ తీశారు-మట్టిని తొలగించలేదు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి పంచాయతీ అధికారులు స్పందించారు. శనివారం రోడ్డుపై ఉన్న మట్టిని జెసిబి సాయంతో తొలగించి, ట్రాక్టర్ ద్వారా అంతరాయం లేకుండా చేశారు. మట్టిని తొలగించడంతో ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టిని తొలగించడం ద్వారా వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేదు తొలగిపోయినట్లు ప్రజలు పేర్కొంటున్నారు. పారిశుధ్య మేస్త్రీలు అల్లాని, మల్లికార్జున దగ్గర ఉండి రోడ్డుపై ఉన్న మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించారు.

వినతి పత్రం అందజేస్తున్న ఆప్ నాయకులు

దోమలు నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో దోమలు నివారణ అధికారులు చర్యలు చేపట్టాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా, ఎంహెచ్‌పిఎస్ పులివెందుల అధ్యక్షుడు మహబూబ్ బాషా కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం కార్యదర్శి నాగభూషణంరెడ్డిని వారు వేర్వేరుగా కలిసి సన్మానించారు. అనంతరం కార్యదర్శికి వినతిపత్రమిచ్చారు. ముఖ్యంగా సరైన కాలువలో ప్రవహించక పోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయినట్లు చెప్పారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమ కాటుకు ప్రజలు గురవుతున్నారన్నారు. విష జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారని వివరించారు. పంచాయతీ కార్యదర్శిని కలిసిన వారిలో ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు గౌస్, ఖదీర్, సమీర్, ఎంహెచ్‌పిఎస్ నాయకులు లాడన్ దర్బార్, కరీముల్లా, మహమ్మద్ గౌస్ ఉన్నారు.

ఆరోగ్యం పట్ల విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ శరణ్య

వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానం

ప్రజాశక్తి - వేముల

వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమని పిహెచ్‌సి వైద్యాధికారి శరణ్య సూచించారు. వేముల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని శనివారం డాక్టర్ శరణ్య సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జ్వరం లక్షణాలు ఉన్న విద్యార్థులను పరీక్షించి, అవసరమైన మందులను ఇచ్చారు. అనంతరం హాస్టల్ సిబ్బందితో డాక్టర్ మాట్లాడుతూ వంటగది శుభ్రత, ఆహార పాత్రలపై మూతలు, తాగునీటి శుద్ధి, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. చేతులు శుభ్రత, దగ్గినప్పుడు చేతి గుడ్డ అడ్డు పెట్టుకోవాలి, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలనే విషయాలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఉషారాణి, సూపర్‌వైజర్ రమేష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రావు, ఆశ కార్యకర్త పద్మావతి, హాస్టల్ వెల్ఫేర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చివరి ప్రయాణానికి చేయూత

ప్రొద్దుటూరు : చివరి ప్రయాణానికి చేయూతగా నిలిచిన మేక హెల్పింగ్ ఫౌండేషన్. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్లో గుర్తుతెలియని వ్యక్తి మరణించగా మేక హెల్పింగ్ ఫౌండేషన్ నిర్వాహకులు శనివారం సాయంత్రం అంతిమ సంస్కారాలు చేశారు. ఆ వ్యక్తి మూడు రోజుల క్రితం మరణించగా ఇంతవరకు ఎవరూ లేకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది ఫోన్‌ద్వారా ఫౌండేషన్ సభ్యులకు తెలిపారు. వెంటనే స్పందించి సాయంత్రం హిందూ స్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గొప్ప కార్యక్రమానికి చేయూతనందించిన ఫౌండేషన్ చైర్మన్ మేకో లక్ష్మణ్‌రావు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ మునీంద్ర, టౌన్ ప్రెసిడెంట్ అఫ్జల్ హుస్సేన్, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ శ్రీఅమ్మ శరణాలయంలోని వృద్ధులకు సాయం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

అదుపుతప్పిన స్కార్పియో

ఆరుగురికి తీవ్రగాయాలు-ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పురపాలిక పరిధిలోని రాయలపురం కేబుల్ బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం స్కార్పియో వాహనం అదుపుతప్పి వంకలో బోల్తా పడింది. స్కార్పియోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కదిరి మండలం పట్నం పంచాయతీ ఏడిగెడ్డ తండా వాసులు జమ్మలమడుగు నియోజకవర్గంలో పెళ్లిచూపులకు పోయి వస్తుండగా.. రాయలపురం కల్వర్టు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి స్కార్పియో వాహనం అదుపుతప్పి కల్వర్టులో పడింది. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉంది. కిరణ్, శ్రీనివాస్ నాయక్, నారాయణస్వామి, చంద్ర నాయక్, రమేష్ నాయక్, మహేంద్ర బాలు గాయపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న పులివెందుల 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్ ద్వారా పులివెందుల జిజిహెచ్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు(ఇన్‌సెట్) కాలికి గాయమైన నారాయణస్వామి

మైదుకూరులో రోడ్డు విస్తరణ పనులు

వనిపెంట రోడ్డులో మార్కెట్ వద్ద ఇంటి నిర్మాణాలను తొలగిస్తున్న జెసిబి యంత్రం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు నుంచి పోరుమామిళ్ల వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మైదుకూరు పట్టణం వనిపెంట రోడ్డులో మార్కెట్ నుంచి కట్టడాలను తొలగింపు ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు నుంచి ఇరువైపులా 15 అడుగుల స్థలాన్ని సేకరించారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఇళ్ల నిర్మాణాన్ని బట్టి నష్టపరిహారాన్ని బాధితులకు పంపిణీ చేశారు. ప్రస్తుతం లబ్ధిదారులు వారికి సంబంధించిన నిర్మా ణాలను జాగ్రత్తగా తొలగించుకుంటున్నారు. హైవే అధికారులు భారీ యంత్రాలతో కట్టడాలను ఇష్టానుసారంగా తొలగిస్తే ఉన్న కొద్దిపాటి నిర్మాణాలు దెబ్బతింటాయని ముందు జాగ్రత్తతో లబ్ధిదారులే కట్టడాలను తొలగించుకుంటున్నారు. ఇప్పటికే వనిపెంట, మల్లేపల్లి మార్గాల్లో బ్రిడ్జిలు, రోడ్డు పనులు ప్రారంభమై ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణంలో ముందుగా ఒక వైపు పనులు ప్రారంభించి ఆ తర్వాత మరోవైపు చేపట్టాలని అధికారులు చర్యలు తీసు కుంటున్నారు. లబ్ధిదారులు చాలామంది వారికి సంబంధించిన నిర్మాణాలను తొలగించుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొంతమంది కూలీలతో భవన నిర్మాణాలను తొలగిస్తుండగా.. మరి కొందరు జెసిబి యంత్రం ద్వారా తొలగింపు పనులు చేపడుతున్నారు.

భవనాలు నిర్మించాకే తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మెడికల్ కాలేజీ భవనాలు పూర్తయిన తర్వాతనే తరగతులు ప్రారంభిస్తామని, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి వైసిపి అసత్య ఆరోపణలు చేస్తోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మెడికల్ కాలేజీని ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ మెడికల్ కాలేజీని గత ప్రభుత్వం రూ.540 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించిందన్నారు. ఇప్పటివరకు ఆసుపత్రి భవనాల మాత్రమే పూర్తిస్థాయిలో నిర్మించారన్నారు. కాలేజీ, విద్యార్థుల వసతి, ఫ్యాకల్టీస్ భవనాలు ఇంకా పూర్తి కాలేదన్నారు. ఫ్యాకల్టీల కొలత కూడా ఉందన్నారు. ఈ సమస్యలు పెట్టుకుని వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై అసత్య పచారాలు చేస్తున్నారన్నారు. టెండర్లు ప్రయివేట్ వ్యక్తులు వేయకూడదని, మళ్లీ తమ ప్రభుత్వం వస్తే రద్దు చేస్తామని మాట్లాడడం బెదిరించడం కాదాని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రూ.400 కోట్లు పనులు జరిగాయని, మిగిలిన రూ.140 కోట్లు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీపై ఎలాంటి నిర్లక్ష్యం వహించలేదన్నారు. నిధుల కొరతతో పిపిపి విధానం తెచ్చారన్నారుఉ. దీనివల్ల పేద విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగదన్నారు. కాలేజీలో 50 శాతం సీట్లు మెరిట్ ద్వారా తీసుకుంటారని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యం ఉచితంగానే చేస్తారన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రమణారెడ్డి, మైసూరారెడ్డి, అంకిరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

హోం మంత్రి అనిత వ్యాఖ్యలు అబద్ధం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల భవనాలన్నీ పునాది దశలోనే ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలంటే ఎక్కువ నిధులు అవసరమని, ప్రభుత్వం వద్ద అంత డబ్బు లేనందున వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని హోం మంత్రి అనిత వ్యాఖ్యానించడం చాలా దురదృష్టకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాటా డుతూ మంత్రి అనిత చెప్పిన మాటల్లో వాస్తవం లేదన్నారు. ఆమె వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలు అన్నారు. ఓసారి పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత మాట్లాడాలని అనితకు సూచించారు. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ఆసుపత్రి భవనాలు, నర్సింగ్ కళాశాల భవనాలు వంద శాతం పూర్తయ్యాయని తెలిపారు. మెడికల్ కళాశాల భవనాలు 60 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. క్వార్టర్స్, మిగతా భవనాలు 60 శాతం పూర్తి అయినట్లు చెప్పారు. జాతీయ మెడికల్ కమిషన్ సభ్యులు క్షేత్రస్థాయిలో పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను పరిశీలించిన తర్వాతనే అక్కడ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వహించేందుకు అన్ని హంగులు ఉన్నాయని చెప్పారని అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూ.3లక్షల 22 వేల కోట్లు అన్నారు. ఇందులో నుంచి వంద కోట్ల ఖర్చు పెడితే పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటుందన్నారు. వంద కోట్ల రూపాయలు ఖర్చుపెట్టలేని దీనా వస్థలో కూటమి ప్రభుత్వం ఉందా అని తులసిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బు లేదనడం సాకు మాత్రమే అన్నారు. ప్రయివేట్ పరం వల్ల పేద రోగులు ఉచిత వైద్యానికి దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేస్తూ జారీచేసిన జిఒ 590ని వెంటనే ఉపసంహరించుకోవాలని తులసిరెడ్డి కోరారు. రెండున్నర ఏళ్ల తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ మణిపూర్ వెళ్లడం శోచనీయమన్నారు.

మరింత పేదలను చేయడమే కూటమి లక్ష్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పేదలను మరింత పేదలుగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన మెడికల్ కాలేజీలపై విలేకరులతో మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజి ఉండాలనేది మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వంతో అనుమతి తీసుకొని జగన్మోహన్‌రెడ్డి గతప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన చేసి, అందులో 7 కాలేజీలను పూర్తి చేశారన్నారు. అందులో కొన్నింటికి కూటమి ప్రభత్వంలో మెడికల్ కాలేజీలకు మెడికల్ సీట్లు వచ్చినా వద్దనడం దారుణమన్నారు. రాష్ట్రంలో రూ.లక్ష కోట్లు విలువ చేసే మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించడం ఏంటని ఆయన ప్రశ్నిం చారు. కేవలం కమీషన్ల కోసం ప్రభుత్వ ఆస్తులను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలోనే పులివెందుల, విజయనగరంలో నిర్మణాలు పూర్తిచేసి, అడ్మిషన్ల సైతం పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గజ్జల లక్ష్మయ్య, జమ్మలమడుగు నియోజకవర్గ వ్యవసాయ విభాగ కమిటీ అధ్యక్షులు వెంకటేశు, జమ్మలమడుగు పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, దన్నవాడ మహేశ్వర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బడిగించాల జనార్దన్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరును జిల్లా చేయాలి : జిల్లా సాధన సమితి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ప్రొద్దటూరును జిల్లా చేయాలని జిల్లా సాధన సమితి జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మైదుకూరు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులచే జిల్లా సాధనకు మద్దతుగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కన్వీనర్ డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితికి ప్రతి ఒక్కరి మద్దతు కోరారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాలతో జిల్లా ఏర్పడితే అటు పారిశ్రామికంగా, ఇటు వ్యవసాయపరంగా బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. జీవ, ప్రకృతి వైవిధ్యం, ఘనమైన సాంస్కృతిక రాజకీయ వారసత్వం కలిగిన ప్రొద్దుటూరును జిల్లాగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సివి సురేష్ మాట్లాడుతూ చారిత్రాత్మకంగా ప్రొద్దుటూరు కీర్తిని, చరిత్రను తెలియజేశారు. ప్రొద్దుటూరును జిల్లా చేయవలసిన ఆవశ్యకతను వివరించారు. ఎన్జీఓ ప్రెసిడెంట్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరును జిల్లా చేయడం వల్ల ప్రభుత్వానికి అదనపు భారం ఏమీ ఉండదని ఉదహరించారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, మైదుకూరు తాలూకా ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి ఎం.రాఘవయ్య, గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, స్పందన రాంప్రసాద్ రెడ్డి, భాస్కర్‌రావు, గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎన్‌వి శివారెడ్డి, వెంకటేష్, శశిధర్‌రెడ్డి, సుజాత, సాదక్ బాషా, షఫీ, స్వరూప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా

ప్రొద్దుటూరు : ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారం వైపు చర్యలు తీసుకోవాలని, రాజకీయ మాటలు మాట్లాడవద్దని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా సూచించారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ హాజరైనప్పటికీ కమిషనర్ అనూహ్యంగా సభ వదిలి వెళ్లిపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. కోరం సభ్యులు ఉన్న సందర్భంలో సభను నడిపే హక్కు పూర్తిగా చైర్మన్‌దేనని స్పష్టం చేశారు. ఆ సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి వ్యాఖ్యలు అసంబద్ధమన్నారు. చట్టబద్ధమైన సమావేశానికి చట్టబద్ధత లేదని చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమే అని విమర్శించారు. ప్రొద్దుటూరులో అభివృద్ధి పూర్తిగా పడకేసిందని విమర్శించారు. రైతులు యూరియా కోసం తంటాలు పడుతున్నా ఎమ్మెల్యే మాత్రం మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. పట్టణ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశా రు. ప్రజాభివృద్ధే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని ఇర్ఫాన్‌బాషా స్పష్టం చేశారు.

మురుగు నీరు ప్రవహించకుండా పనులు

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులోని ప్రధాన రహదారిలో రోడ్డుపై మురుగు నీరు ప్రవహించకుండా టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, గోగుల మల్లికార్జున శనివారం పనులను చేయించారు. కొద్ది రోజులు నుండి మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. ఆ రహదారిలో వెళ్లే ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. సమస్యను ఆ ప్రాంత ప్రజలు మహమ్మద్ షబ్బీర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన స్పందిస్తూ శనివారం పంచాయతీ సిబ్బందిని పిలిపించి మురుగు కాలువల్లో ఉన్న చెత్తను తొలగింప జేశారు. మురుగు కాలువ సరిగాలేక పోవడంతోపాటు చెత్త కాలువలో నిండిపోయింది. ప్రతి రోజూ మురుగు కాలువలో చెత్తను తొలగించాలని పంచాయతీ సిబ్బందిని కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చక్రాయపేట : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి అక్రమంగా తరలించడం వంటి చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని నాన్ గవర్నమెంట్ ఆర్గనైజర్ ఎన్జీవో కౌన్సిలర్ బి.వాణి తెలిపారు. శనివారం గండి దేవస్థాన ఇఒ జె.వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రం పంచముఖ ఆంజనేయ స్వామి సన్నిధిలో రూరల్ డెవలప్మెంట్ ఎండోమెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్జీవో కౌన్సిలర్ కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ శివనాగమ్మ, భారతి మాట్లాడుతూ గండి క్షేత్రంలో వివాహాలు జరిపే రఘు స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆధార్ కార్డు నమోదు చేసే గండి దేవస్థాన సిబ్బంది శ్రీనివాసులరెడ్డి సమక్షంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలతో పిల్లల జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో గండి దేవస్థానానికి విచ్చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న భూపేష్ సుబ్బరామిరెడ్డి

ప్రభుత్వ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఈ ఒకటిన్నర సంవత్సర కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేయాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ప్రతి ఇంటికి మంచి చేకూరిందా లేదా తెలుసుకోవాలన్నారు. ఏదైనా సమస్యలుంటే తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కూడా కృషి చేయాలని సూచించారు. అంతకుముందు దేవగుడిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలతో సమస్యలు తెలుసుకున్నారు. సమావేశంలో ఐఎల్ చిన్న, నవీన్, రాజారెడ్డి, నియోజకవర్గంలోని కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర డైరెక్టర్ జగన్నాథరెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నేతలు

అర్హులకు ఇంటి నిర్మాణాలు చేపడుతాం

హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జగన్నాథరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తామని హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జగన్నాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పులివెందుల బైపాస్ రోడ్డులో వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పివి రమణ, మాజీ చైర్మన్ ఎద్దుల కొండయ్య ఆధ్వర్యంలో హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జగన్నాథరెడ్డికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా జగన్నాథరెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవ చేసేందుకు హౌసింగ్ డైరెక్టర్ పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. గతంలో చాలా మంది నిరుపేదల రేషన్ కార్డులు తీసుకొని కొందరు ఇంటి నిర్మాణం చేపట్టారని, దీంతో లబ్ధిదారులు ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పాలనలో నిజమైన లబ్ధిదారులందరికీ సొంతిదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లగారి కృష్ణారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, ఎల్‌బిఆర్ భాస్కర్ రెడ్డి, బిజెపి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుష్మా, ప్రసాద్ ఒడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరామిరెడ్డి, లాడన్, ఈశ్వరరెడ్డి తో పాటు పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షిస్తే ఆహ్లాదకరం

ప్రజాశక్తి - వేంపల్లె

మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే ఇక్కడికి వచ్చే భక్తులకు ఆహ్లాదం దొరుకుతుందని టిడిపి నేత రజనీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పాపాఘ్ని నది సమీపంలో ఉన్న ఎద్దుల కొండపై పర్యావరణ పరిరక్షణలో భాగంగా దేవస్థానం చైర్మన్ పివి రమణ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఎద్దుల కొండపై మొక్కలు నాటారు. మొక్కలు నాటడం వలన వాతావరణంలో కూడా మార్పులు వస్తాయన్నారు. కాలుష్యం ఉండదని తెలిపారు. ఆలయాల వద్ద మొక్కలు ఉంటే భక్తులు సంతోషంగా గడిపేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు, టిడిపి నేత రామకృష్ణారెడ్డి, బిజెపి నేతలు సుష్మా, ప్రసాద్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు హరిప్రవీణ్, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

నేత్ర సంరక్షణపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రతి ఒక్కరూ తమ నేత్రాల సంరక్షణపై దృష్టి సారించాలని ప్రొద్దుటూరు అభిలాష్ నేత్ర వైద్య శాల డాక్టర్ గురుఅభిలాష్ సూచించారు. శనివారం మండలంలోని గోపవరం గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. హెూలీస్టిక్, అభిలాష్ నేత్ర వైదశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరన్ని ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులను ఇచ్చారు. వైద్యులు గురు అభిలాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి నేత్రాలను జాగ్రత్తగా చూసుకోవాలని, కంట్లో ఏదైనా పడితే రుద్దరాదన్నారు. మెత్తని బట్ట లేదా దూదితో తొలగించే ప్రయత్నం చేయాలని సూచించారు. అవసరమైతే సమీపంలోని వైద్యుడ్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు బచ్చల వీరప్రతాప్, ప్రొద్దుటూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పట్నం లక్ష్మణ్, స్థానిక నాయకులు అంజి, బాలయ్య, సుబ్బరాయుడు, డీలర్ భాస్కర్, బాషా, సుబ్బరావు, పుల్లయ్య, నాగరాజు, రాము, గంగాధర్ యాదవ్, నల్లం సుబ్బ, వెంకటరాముడు, కొండయ్య, రమేష్ పాల్గొన్నారు.

అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక నాగమ్మ నగర్‌లో ఉన్న మదర్ థెరీసా అనాథ వృదాశ్రమంలో శనివారం అన్నదానం చేశారు. టిడిపి యువనేత సింగారెడ్డి శివ కృష్ణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన స్నేహితులు ఆధ్వర్యంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి, అన్నదానం చేసినట్లు ఆయన స్నేహితుడు సుదర్శన్ తెలిపారు. వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో చింతలమడుగుపల్లె టిడిపి నేత రామాంజీ, శివకృష్ణారెడ్డి స్నేహితులు, ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, ప్రొద్దుటూరు

I.P.No. 9/2025

వంకదార నిరంజన్, S/o క్రిష్ణయ్య, డోర్ నెం.12/153-36, మైదుకూరు గ్రామము మరియు మండలము, కడప జిల్లా.
...పిటిషనరు

Vs

1. నేతి పెద్ద రెడ్డెయ్య, S/o సుబ్బరాయుడు, బద్వేలు రోడ్డు, మైదుకూరు గ్రామము మరియు మండలం.
2. భూపాళం శ్రీనివాసులు, S/o రామసుబ్బయ్య, బద్వేలు రోడ్డు, మైదుకూరు గ్రామము మరియు మండలం.
3. బల్లాని ప్రసాద్, S/o చెన్నకేశవ, టీచర్, ప్రొద్దుటూరు రోడ్డు, మైదుకూరు గ్రామము మరియు మండలం.
4. అంకిరెడ్డిపల్లి లక్ష్మిదేవి, ఆర్టీసీ కండక్టరు, మూలవారిపల్లె గ్రామము, ఖాజీపేట మండలం.
5. గవిరెడి చంద్ర ఓబులరెడ్డి, S/o జయరామిరెడ్డి, యల్లంపల్లి గ్రామము, మైదుకూరు మండలం.
6. గవిరెడ్డి జయరామిరెడ్డి, S/o తెలియదు, వ్యాపారము, యల్లంపల్లి గ్రామము, మైదుకూరు మండలం.
7. నక్కరామసుబ్బయ్య, రెడిమేడ్ బట్టల వ్యాపారము, రాజాజీ రోడ్డు, ప్రొద్దుటూరు తాలూకా మరియు మండలం.
8. డి.అయ్యావారప్ప, S/o వెంకటరామయ్య, శీలంనగర్, మైదుకూరు గ్రామము, మరియు మండలం.
9. శ్రీమతి సుధామణి, W/o అయ్యావారప్ప, శీలంనగర్, మైదుకూరు గ్రామము మరియు మండలం.
10. నందిమండలం సుధాకర్ రెడ్డి, S/o నారాయణరెడ్డి, రెడీమేడ్ డ్రస్ వ్యాపారము, వెదురూరు గ్రామము, చాపాడు మండలం.
11. శ్రీమతి కందుల సుభద్రమ్మ, W/o సుబ్బారెడ్డి, బొల్లవరం, ప్రొద్దుటూరు తాలూకా మరియు మండలం.
12. యల్లనూరు వేణుగోపాల్, S/o రామయ్య, రైస్‌మిల్ ఓనరు, బద్వేలు రోడ్డు, మైదుకూరు.
13. యల్లనూరు లక్ష్మణ గౌరవ్, S/o రాజశేఖర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, సాయిబాబా దేవాలయం వీధి, మైదుకూరు తాలూకా మరియు మండలం.
14. పుత్తా శివ, S/o రామయ్య, ఫైనాన్స్ వ్యాపారం, శీలంనగర్, మైదుకూరు గ్రామము మరియు మండలం.
15. గజ్జ శివరామక్రిష్ణ, S/o పెద్ద వెంకటయ్య, వ్యాపారం, కడప రోడ్డు, మైదుకూరు గ్రామము మరియు మండలం.
16. కిన్నెర కాపిటల్, రెప్ బై ఇట్స్ మేనేజర్, బాలు, సినీ హబ్ ప్రక్కన, ప్రొద్దుటూరు తాలుక మరియు మండలం.
17. పుష్పతి గార్మెంట్స్, రైస్ బై మురళి, శ్రీ శారదా అంబిక రెడిమేడ్ గార్మెంట్స్, 2వ ఫ్లోరు, శాదీముహల్ థియేటర్ దగ్గర, విజయవాడ.

...రెస్పాండెంట్లు

పబ్లిక్ నోటీసు

పై కేసులోని పిటిషనరు ఇన్‌సాల్వెంట్‌గా నిర్ధారణ చేయమని రెస్పాండెంట్లపైన ఐ.పి.దాఖలు చేసియున్నారు. అట్టి ఐ.పి. పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట తేది: 16.09.2025 ఉదయం 10.30 ని॥లకు హాజరు అయి ఏమైనా ఆక్షేపణలు వున్న ఎడల తెలుపుకోవలసినది. లేనిఎడల పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 16.09.2025

//By Order of the Court//

ఎస్.కె.రియాజుద్దీన్

అడ్వకేట్ మరియు నోటరి, ప్రొద్దుటూరు.